భవిత కేంద్రంతో ఆసరా

- పదేళ్లుగా కేంద్రం ద్వారా శిక్షణ
- మానసిక, శారీరక పరిస్థితిలో మార్పు తీసుకొస్తున్న సిబ్బంది
- కదలలేని పిల్లలకు ఇంటి వద్దే తర్ఫీదు

సీతంపేట : మానసిక, శారీరక ఎదుగుదల లేక ఇబ్బంది పడుతున్న పిల్లలకు భవిత కేంద్రం భరోసాగా నిలుస్తోంది. తల్లిదండ్రులు ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకునే పిల్లల్లో కొందరు వయస్సు పెరుగుతున్నా చంటిపిల్లల్లా ప్రవర్తిస్తుంటారు. ఏం చేస్తున్నారో.., ఎలా చేయాలో తెలయని మనస్తత్వంతో ఉంటారు. అటువంటి వారికి నిత్యం తల్లో తండ్రో వెన్నంటి ఉండాల్సిందే. ప్రతి చిన్నపనికి తల్లిదండ్రుల ఆసరా అవసరం. ఇటువంటి చిన్నారుల విషయంలో తల్లులకు బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుంది. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన పరిస్థితి. అటువంటి పిల్లల్లో మానసిక, శారీరక పరివర్తనను తీసుకొచ్చేలా ప్రత్యేక సేవలందిస్తోంది అక్కయ్యపాలెం ఎన్జీజీవో స్కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఆవరణలో గల ప్రత్యేక అవసరాల పిల్లల వనరుల భవిత కేంద్రం (సీతమ్మధార).

రోజురోజుకూ పిల్లల్లో మార్పు

బుద్ధి మాంద్యం, ఆటిజం, వినికిడి లోపం, అంగవైకల్యం వంటి 21 రకాల సమస్యలతో బాధపడుతున్న పిల్లల కోసం భవిత కేంద్రాన్ని 2013లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇక్కడ 20 మంది పిల్లలకు సిబ్బంది ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వీరికి శిక్షణ ఇవ్వడానికి ఇద్దరు టీచర్లు, ఫిజియోథెరపిస్టు, ఒక కేర్ గివింగ్ వలంటీర్ ఉన్నారు. రోజూ ఉదయం 9 గంటలకు పిల్లలను తల్లిదండ్రులు భవిత కేంద్రం వద్ద విడిచిపెట్టి వెళ్తుంటారు. అప్పటి నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇక్కడి సిబ్బంది పిల్లల ఆలనాపాలనా చూసుకుంటారు. బుద్ధి మాంద్యం పిల్లల్లో మానసిక పరివర్తన, ఊహా శక్తి, తెలివితేటలు పెంచేలా పజిల్స్ నేర్పించడంతోపాటు, చిన్న చిన్న ఆటపాటలు ఆడిస్తుంటారు. అక్షరాలు, అంకెలు, లెక్కించడం, రైమ్స్, వస్తువులను గుర్తించడం, పలకరించడం, మాట్లాడటం, తమ పనులు తాము సొంతంగా చేసుకోవడం ఇలా తల్లిదండ్రులపై ఆధారపడకుండా శిక్షణ అందజేస్తున్నారు. అవసరమైన పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ ఇస్తున్నారు. ఇలా రోజూ చెయ్యడం వల్ల వారి ప్రవర్తనలో మార్పువచ్చి ఆలోచన, ఏకాగ్రత, మాట స్పష్టత పెరిగి చాలా వరకు ఆరోగ్యం మెరుగుపడుతోందని సిబ్బంది చెబుతున్నారు. దుస్తులు ఎలా వేసుకోవాలి, ఎవరితో ఎలా నడుచుకోవాలి వంటి అంశాలపై దృష్టి పెడుతున్నారు. ఆరోగ్యం మెరుగుపడ్డాక వారిని ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నారు. కదలలేని పరిస్థితిలో బాధపడుతున్న పిల్లలకు ప్రతీ శనివారం భవిత కేంద్రం సిబ్బంది వారింటికి వెళ్లి శిక్షణ ఇస్తున్నారు. అక్షరాలు, పజిల్స్, మాటలు నేర్పిస్తున్నారు. శిక్షణ వల్ల పిల్లల ప్రవర్తనలో మార్పు వస్తోందని తల్లులు చెబుతున్నారు.


బుద్ధి మాంద్యం చిన్నారికి ఇంటి వద్ద శిక్షణ ఇస్తున్న భవిత కేంద్రం టీచర్


అవయవాల గుర్తింపుపై శిక్షణ ఇస్తున్న టీచర్


పేపర్‌తో తయారు చేసిన క్రాఫ్ట్స్‌తో పిల్లలు


అక్కయ్యపాలెం భవిత కేంద్రంలో పిల్లలకు శిక్షణ ఇస్తున్న టీచర్ జగదాంబ


ఫిజియోథెరపీ చేస్తున్న ఫిజియోథెరపిస్టు చంద్రకళ

అవసరమైన శిక్షణ ఇస్తున్నాం



భవిత కేంద్రానికి వచ్చే పిల్లల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వారి మానసిక పరిస్థితిని గుర్తించి దానికి తగినట్టు వారికి అవసరమైన శిక్షణ ఇస్తున్నాం. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు వారి ఆలనాపాలనా చూసుకుంటున్నాం. భోజనం పెట్టడం, చదవు చెప్పడం, ప్రమాదానికి గురికాకుండా ఎలా ఉండాలో నేర్పిస్తున్నాం. భవిత కేంద్రంలో శిక్షణ తర్వాత పిల్లల ప్రవర్తన, మానసిక స్థితిలో ఎంతో మార్పు వస్తోంది. దీని వల్ల పిల్లల పట్ల తల్లులకు కొంత భారం తగ్గుతుంది. శిక్షణ పూర్తయ్యాక సాధారణ పిల్లలతో కలిపి బడికి పంపిస్తున్నాం.

– జగదాంబ, భవిత టీచర్, అక్కయ్యపాలెం

ట్రావెల్ అలవెన్సు ఇస్తున్నాం



అక్కయ్యపాలెం భవిత సెంటర్‌లో 20 మంది పిల్లలున్నారు. సీతమ్మధార మండల పరిధిలో 210 మంది పిల్లలు, పది మంది హోంబేస్డ్ పిల్లలకు సేవలందిస్తున్నాం. పిల్లలకు ఎస్కార్ట్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్సు అందజేస్తున్నాం. మండలంలో ఉన్న పిల్లలకు మెడికల్ అసెస్‌మెంట్ క్యాంప్స్, వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, హియరింగ్ మిషన్స్ ఇస్తున్నాం. అవసరమైన చిన్న చిన్న ఆపరేషన్లు చేయిస్తూ, వారికి అవసరమైన శిక్షణ అందిస్తున్నాం.

– బి.శ్రీనివాసరావు, అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్

ఏడాదిన్నరగా మా పాపకు శిక్షణ



మా పాప పుష్ప(10) వినికిడి లోపంతో పుట్టిన ప్పటి నుంచి మాట్లాడలేకపోతోంది. పెద్ద పెద్ద సౌండ్స్ మాత్రమే వినిపిస్తాయి. ఏడాదిన్నర నుంచి భవిత కేంద్రానికి తీసుకొస్తున్నాం. ఇక్కడ స్పీచ్ థెరపీ, సైన్ లాంగ్వేజ్, లిప్ మూమెంట్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆల్ఫాబెట్స్, చిన్న పదాలు చెబుతోంది. మా అమ్మాయి పరిస్థితి చాలా మెరుగైంది.

– పి.కల్యాణి, విద్యార్థిని తల్లి, ఎంవీపీ కాలనీ

రెండేళ్లుగా ఆటిజానికి శిక్షణ



మా అబ్బాయి సాగర్ (14) ఆటిజంతో బాధపడుతున్నాడు. మన లోకంతో సంబంధం లేకుండా వేరే లోకంలో ఉంటాడు. ఏవీ పట్టించుకోడు. గత రెండేళ్లుగా భవిత సెంటర్‌కు తీసుకొస్తున్నాను. కలర్స్, వస్తువులు గుర్తిస్తున్నాడు. తన దైనందిన జీవితంలో అన్ని పనులు తనుకు తాను చేసుకుంటున్నాడు. చాలా మార్పు కనిపించింది. ఇంకా మెరుగయ్యే అవకాశం ఉంది.

– ఇవటూరి రేవతి, విద్యార్థి తల్లి, ఎన్ఏడీ కూడలి

వేంకటేశ్వరస్వామి కల్యాణం రేపు

సీతంపేట : అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో బుధవారం సాయంత్రం శ్రీభూ నీలా సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ తెలిపారు. బుధవారం సాయంత్రం 6:30 గంటలకు పీఠం దర్బారు హాలులో తిరుపతి సాంప్రదాయంలో కల్యాణం జరిపిస్తామని తెలిపారు. అదే రోజు ఉదయం 5 గంటల నుంచి స్వామి వారికి మేలుకొలుపు, సుప్రభాత సేవ, తోమాల సేవ నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించి తరించాలని కోరారు. మంగళవారం రాత్రి కాలభైరవ హోమం, గురువారం ఉదయం 9 గంటలకు చండీ హోమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

త్వరగా ప్రజా సమస్యల పరిష్కారం


అర్జీదారుల సమస్యలు వింటున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము

కంచరపాలెం : జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్ – 5 కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో పలు సమస్యలపై సోమవారం 07 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 04, రెవెన్యూకు 02, ఇంజినీరింగ్ విభాగానికి 01 వినతి వచ్చినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో ఈఈ తారా ప్రసన్నరెడ్డి, ఏసీపీ ఇన్‌చార్జి విజయకుమార్, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏపీడీలు పద్మావతి, సూపరింటెండెంట్‌లు రాజు, వెంకటరమణ, కార్యాలయ సిబ్బంది శేఖర్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 7 వినతులు

సీతమ్మధార : స్థానిక సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీదారులు వినతులు అందజేశారు. తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ వినతులు స్వీకరించారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల పత్రం (ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్) కోసం మొత్తం 7 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్‌వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో గ్రీవెన్స్

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోని ఉత్తర నియోజకవర్గం బీజేపీ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు వినతులు స్వీకరించారు. కొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నో హెల్మెట్.. నో ఎంట్రీ


ఫోర్తుటౌన్ గేటు వద్ద ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బోర్డు

సీతమ్మధార : ద్వారకా ట్రాఫిక్ పోలీసులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ గేటు వద్ద "నో హెల్మెట్.. నో ఎంట్రీ" అంటూ ఒక బోర్డు ఏర్పాటు చేశారు. హెల్మెట్ ధరించకుండా బైక్ నడిపిన వారికి చట్ట ప్రకారం రూ.1035 జరిమానాతోపాటు వాహనదారుడి డ్రైవింగ్ లైసెన్స్ మూడు నెలలపాటు సస్పెండ్ చేస్తామని పేర్కొన్నారు. దీంతో స్టేషన్‌కు వచ్చే వారంతా ఆ బోర్డు చదువుకుంటూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే రూ.1035 ఫైన్ కట్టాల్సిందే అనుకుంటున్నారు.

దుర్గా గణపతి హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న శ్రీహరి సేవా సంఘం సభ్యులు

సీతంపేట : దేవదాయశాఖ పరిధిలో గల సీతంపేట దుర్గా గణపతి ఆలయ హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. దేవదాయ శాఖ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఈవో జీ.వి.రమాభాయి పర్యవేక్షణలో శ్రీహరి సేవా సంఘం సభ్యులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నెల రోజులకు రూ. 1,11,897లు ఆదాయం వచ్చినట్టు ఈవో రమాభాయి తెలిపారు.

శాంతిపురంలో అన్నసంతర్పణ


శాంతిపురంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సీతంపేట : స్థానిక శాంతిపురంలో కొలువైన శ్రీసాయి గణపతి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం మహా అన్నసంతర్పణ నిర్వహించారు. మొకర వెంకటరావు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, కె.లావణ్య, పరమేశ్వరరావు, ఎం.ఎల్లాజీ, అప్పారావు, వై.దేవేంద్రరావు, ఎం.శంకర్, అప్పన్న, మన్మథరావు, బుజ్జి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

థైక్వాండోలో క్రీడాకారునికి ఆర్థిక సాయం


క్రీడాకారుడు ప్రకాష్‌కు చెక్కు అందజేస్తున్న తిరుపతిరాజు, తదితరులు

సీతమ్మధార : థైక్వాండోలో విశేషంగా రాణిస్తున్న నిరుపేద క్రీడాకారుడు ప్రకాష్‌కు ఎలయన్స్ క్లబ్ ఆర్థిక సాయం అందించింది. ఈ మేరకు సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో గల కార్యాలయంలో క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 105 తరపున ఎలయన్స్ క్లబ్ గవర్నర్ దండెం పోలారావు సమక్షంలో పూర్వాధ్యక్షుడు తిరుపతిరాజు రూ.60 వేల సాయం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన ప్రకాష్ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో భారతదేశానికి ఎన్నో పతకాలు సాధించారని గుర్తు చేశారు. ఆయన థైక్వాండో క్రీడలో చీఫ్ కోచ్ డాక్టర్ పొంద్రంగి రుక్మాకరరావు వద్ద శిక్షణ పొందారని కొనియాడారు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కంటకాపల్లి గ్రామస్తుడు ప్రకాష్ ప్రస్తుతం కంచరపాలెంలో నివసిస్తున్నారని తెలిపారు. మలేసియాలో ఈ నెల 27 నుంచి జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు ఈ ఆర్థిక సాయం అందజేశామన్నారు. ప్రకాష్ మరిన్ని పోటీల్లో పాల్గొని, పతకాలు సాధించి విశాఖపట్నానికి అంతర్జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం నిర్వాహకులకు ప్రకాష్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో థైక్వాండో చీఫ్ కోచ్ రుక్మాకరరావు, క్లబ్ ప్రతినిధులు మట్టపల్లి విశ్వేశ్వరరావు, డీఆర్‌కే రావు, కె.చంద్రశేఖరరావు, ఎ.ఉషారాణి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తల్లీకుమార్తె అదృశ్యం


రమ

మద్రిపాలెం : కుమార్తెతో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా చీపురుపల్లిలో భర్త, కుమార్తెతో కలిసి నివసిస్తున్న రమ (21) ఈ నెల 18న కంచరపాలెం ధర్మానగర్ శివాలయం వీధిలో ఉంటున్న తల్లి వద్దకు కుమార్తెను తీసుకుని వచ్చింది. అనంతరం ఈ నెల 22న తెల్లవారుజామున కుమార్తెను తీసుకుని కుళాయి నీరు తీసుకొచ్చేందుకు వెళ్లిన రమ ఎంతకీ రాకపోవడంతో ఆమె సోదరుడు ఎం.సాయి సోమవారం రాత్రి కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ బీఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి నష్టం



సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలతో బుల్లయ్య కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు

సీతంపేట : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుల్లయ్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల సమీపంలోని రేసపువానిపాలెంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే అనర్థాలను వివరించారు. బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.సతీష్ నాయుడు పర్యవేక్షించారు.

వార్డెన్ ప్రసాదరావు సస్పెన్షన్ అన్యాయం


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరశన వ్యక్తం చేస్తున్న సంఘం నాయకులు

మహారాణిపేట : సీతమ్మధార సాంఘిక సంక్షేమ వసతి గృహం వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.ప్రసాదరావుని సస్పెండ్ చేయడం అన్యాయమని నవయానం బహుజన సంక్షేమ సంఘం కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రసాదరావు ఎస్సీ బాలుర వసతి గృహం సీతమ్మధారలో గత 2 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. గత 32 ఏళ్లుగా సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో వివిధ వసతి గృహాల్లో విధులు నిర్వహించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు ఉత్తమ ఆఫీసర్ అవార్డు, ప్రసంశా పత్రాలతో సత్కరించాయని గుర్తు చేశారు. అటువంటి ప్రసాదరావు సస్పెన్షన్‌ను రద్దు చేసి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను వార్డెన్ ప్రసాదరావు, విద్యార్థులు కలిశారు.

అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీల తొలగింపు


సీతమ్మధారలో బడ్డీలు, ఆటోపై సాగిస్తున్న వ్యాపారం తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార : ఫుట్‌పాత్‌లు, కల్వర్టులు ఆక్రమించి అక్రమంగా వ్యాపారాలు సాగిస్తున్న బడ్డీలను ద్వారకా పోలీసులు సోమవారం తొలిగించారు. ద్వారకా సర్కిల్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ భాస్కరరావు, సిబ్బంది ఫుట్‌పాత్‌లు, రహదారిపై బడ్డీలు, తోపుడుబళ్లను తొలిగించారు. 'ఆక్రమణలో ఫుట్‌పాత్‌లు' శీర్షికతో సాక్షిలో ఆదివారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. సీతమ్మధారలోని అనేక రహదారులు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వీధి, వాణిజ్య వ్యాపారులు కార్యకలాపాలు సాగిస్తున్నారు. దీంతో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. జీవీఎంసీ 24, 14వ వార్డుల పరిధిలోని నక్కవానిపాలెం, గాంధీనగర్, బాలయ్యశాస్త్రి లే అవుట్, నార్త్ ఎక్స్‌టెన్సన్, తహసీల్దార్ కార్యాలయం పక్క నుంచి గురుద్వారాకు వెళ్లే రోడ్డు, ఆక్సిజన్ టవర్స్ పక్క రోడ్డు, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డు, ఎన్ఆర్ఐ ఆస్పత్రి పక్క రోడ్డులో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. గాంధీనగర్, నక్కవానిపాలెం, గురుద్వారాకు వెళ్లే మార్గంలో పాదచారులు ఫుట్‌పాత్‌లపై కాదు కదా రోడ్డుపై నడిచే పరిస్థితి కూడా లేదు. ఈ పరిస్థితుల్లో ఆక్రమణలు తొలగించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి


ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్‌ను విలీనం చేయడంతోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఉక్కు కార్మిక సంఘాలు అన్నారు. స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద సోమవారం పెద్ద ఎత్తున ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులు పడుతుందన్నారు. కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కి ప్రభుత్వ రంగాన్ని నాశనం చేస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత పరిస్థితికు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. పూర్తి సామర్థ్యంతో ప్లాంట్ నడిపితే మనుగడ ఉంటుందన్నారు. కార్మిక చట్టాల స్థానంలో ప్రవేశపెట్టిన 4 కోడ్‌లను ఉపసంహరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు కె.ఎస్.ఎన్. రావు, డి. ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు జె. అయోధ్యరామ్, యు. రామస్వామి, వై.టి.దాస్, జె. రామకృష్ణ, నరేష్‌కుమార్, వరసాల శ్రీనివాస్, దొమ్మేటి అప్పారావు, బి. డేవిడ్, మహాలక్ష్మి నాయుడు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి


జగదాంబ జంక్షన్‌లో నిరశన తెలియజేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

అల్లిపురం/మహారాణిపేట : కేంద్రం ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, 2021కి ముందు అమలులో ఉన్న 44 లేబర్ చట్టాలను తిరిగి పునరుద్ధరించాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జగదాంబ జంక్షన్‌లో నిరశన తెలిపారు. భారతీయ కార్మిక వర్గం స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారితో పోరాడుతూనే కార్మిక సమస్యలపై గలమెత్తి ట్రేడ్ యూనియన్ యాక్ట్, ఫ్యాక్టరీస్ యాక్ట్ వంటి చట్టాలతోపాటు 44 కార్మిక చట్టాలను సాధించుకుందని గుర్తు చేశారు. అలాగే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, సొంత గనులు కేటాయించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ బ్లాక్ డే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు, అధ్యక్షుడు ఎం.మన్మధరావు, సహాయ కార్యదర్శి ఎస్.కె.రహమాన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, బి.జగన్, నాగభూషణం పాల్గొన్నారు.

19 తులాల బంగారం అపహరణ

సీతమ్మధార : ఫోర్తుటౌన్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రిన్స్ అపార్టుమెంట్‌లో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తాటిచెట్లపాలెం దరి ప్రిన్స్ అపార్టుమెంట్‌లో జీ.వి.జె.ఆర్.శర్మ, అతని భార్య డి.ఎస్.వాణి నివసిస్తున్నారు. వీరింటిలో ఇద్దరు మహిళలు పనిచేస్తుంటారు. ఈ నేపథ్యంలో వాణి (80) వరలక్ష్మి వ్రతం కోసం బంగారు నగలు వేసుకుని అదే రోజు మళ్లీ బీరువాలో పెట్టేశారు. ఇటీవల బంధువుల ఇంటికి వెళ్లేందుకు నగలు కోసం బీరువా తీయగా 19 తులాల (220 గ్రాములు) బంగారు నగలు కనిపించ లేదు. ఇళ్లంతా వెతికినా కనిపించకపోవడంతో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో క్రైం సీఐ రాజుల నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజేంద్రనగర్‌లోని ఇంటిలో చోరీ

సీతమ్మధార : ద్వారకా క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజేంద్రనగర్‌లోని ఒక ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సీతంపేట సమీప రాజేంద్రనగర్‌లో సీహెచ్.ఈశ్వరరావు (కారు డ్రైవర్), భార్య, తల్లి, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. టైలరింగ్ పని కోసం భార్య ఉదయం వెళ్లి సాయంత్రం ఐదు గంటలకు వస్తుంది. పిల్లలు స్కూల్‌కు వెళ్లిపోతారు. తల్లి మాత్రమే ఇంట్లో ఉంటుంది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఈశ్వరరావు తల్లి టీవీ చూస్తుండగా... గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి బీరువాలోని ఆరు తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరించుకుపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన ఈశ్వరరావు భార్య బీరువా తీసి చూడగా నగదు, బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో ద్వారకా క్రైం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ బంగారు పాప, ఎస్ఐ రాజుతో పాటు క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌ఆర్‌ఏ కొనసాగించాల్సిందే


స్టీల్‌ప్లాంట్ సీఎండీ, డైరెక్టర్లతో చర్చలు జరుపుతున్న కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ యాజ మాన్యం ఇంటి అద్దె (హెచ్‌ఆర్‌ఏ), ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, ఎల్‌టీఏలను నిలిపి వేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌లో ఈ అంశంపై ఆందోళన చేశారు. సీఎండీ కార్యాలయం ముందు బైఠాయించారు. దీంతో హెచ్‌ఆర్ సీజీఎం కార్మిక సంఘాలతో జరిగిన చర్చల్లో డైరెక్టర్ (పర్సనల్) సమక్షంలో చర్చలు జరపడానికి ప్రతిపాదించారు. దీనికి అంగీకరించని కార్మిక సంఘాలు నిర్ణయాధికారం ఉన్న సీఎండీతో మాట్లాడతామని పట్టుబట్టారు. దీంతో సీఎండీ అరుణ్ కాంతి బాగ్చి, డైరెక్టర్ ఎస్.సి. పాండే, హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీలతో చర్చించారు. ఉత్తర్వులు రద్దుపై పున:పరిశీలించడానికి సీఎండీ బాగ్చి సమయం కోరారని నాయకులు తెలిపారు. సమావేశంలో నాయకులు జె. అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్. రావు, గణపతిరెడ్డి, నమ్మి సింహాద్రి, వరసాల శ్రీనివాస్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.